అంగన్‌వాడీలు అస్తవ్యస్తం

- సొంత భవనాలు కరువు
- అద్దె ఇళ్లు, కమ్యూనిటీ హాళ్లలో నిర్వహణ
- వసతులు కరువు
- ఇరుకు గదుల్లో ఇబ్బంది



నార్నూర్‌లోని విజయ్‌నగర్‌కాలనీలో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం



ఇరుకుగదిలో చిన్నారులకు ఆటపాటలతో బోధిస్తున్న టీచర్

నార్నూర్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సొంత భవనాలు లేక కొన్ని అద్దె ఇళ్లల్లో, మరికొన్ని కమ్యూనిటీ హాళ్లల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నడుస్తున్న కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని టీచర్లు, చిన్నారులు భయపడుతున్నారు. కొన్నిచోట్ల ఇరుకు గదులు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరైన రెండేళ్లగా నిర్మాణ దశలోనే ఉన్నాయి.

నార్నూర్ ప్రాజెక్టు పరిధిలో..

నార్నూర్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 154 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 154 ప్రధాన కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 43 సొంత భవనాలు, 62 అంగన్‌వాడీ భవనాలు అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. 49 కేంద్రాలు ప్రభుత్వ కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ పాఠశాల తదితర వాటిలో కొనసాగుతున్నాయి.

కనీస వసతులు కరువు

ప్రభుత్వ కమ్యూనిటీ హాళ్లలో, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతోపాటు అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీల కేంద్రాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని గ్రామాల్లోని ఒకే గదిలో అద్దె ఇంట్లో కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఓ వైపు వంట సామగ్రి, మరోవైపు విద్యార్థులను కూర్చోబెట్టడం టీచర్లకు ఇబ్బందిగా మారింది. చిన్నారులు ఆడుకునేందుకు స్థలం లేకుండా పోయింది. పలుచోట్ల విద్యుత్ సౌకర్యం, వంట గదులు, మరుగుదొడ్లు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నారులు ఒంటికి రెంటికీ బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సొంత భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

నార్నూరు ప్రాజెక్టు పరిధిలో సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. సౌకర్యంతో ఉన్న కేంద్రాలు సక్రమంగా నిర్వహిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో కేంద్రాల నిర్వహణ చేపడుతున్నాం.
– శారద, సీడీపీవో, నార్నూర్

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సుంకిడిలో సర్వేను పరిశీలిస్తున్న శ్యామలాదేవి

తలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. మండలంలోని సుంకిడి గ్రామంలో మంగళవారం సర్వేతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే అధికారులకు ప్రజలు వివరాలు అందించి సహకరించాలన్నారు. గ్రామంలో ఇప్పటివరకు 50 శాతం సర్వే పూర్తయిందని కార్యదర్శి పంచాయతీ సచిన్ తెలిపారు. గ్రామస్తుడు మగ్గిడి ప్రకాశ్, తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని నారాయణపూర్‌లో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీవో రాజ్‌వీర్ మంగళవారం పరిశీలించారు. సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జైనథ్ పీహెచ్‌సీ వైద్యాధికారి నయనత అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం జైనథ్ మండలంలోని దీపాయిగూడ జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. న్యూట్రీషియన్స్‌పై అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెచ్ఎం విజయసారధి, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ: విద్యార్థినులు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని హెచ్ఈఓ పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యూట్రీషన్ డే నిర్వహించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి రజిత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జయశ్రీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: అర్హులైన ప్రతిఒక్కరూ పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి.రాజారామ్ యాదవ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ, లెక్చరర్లు, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, న్యాయవాదులను కలిసి ఓటు నమోదుకు చొరవ తీసుకోవాలని కోరారు. అంతకు ముందు మాజీ మంత్రి జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 23 నుంచి డిసెంబర్ 9 వరకు ఓటర్ నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దీన్ని పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీవైజేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, హనుమాన్లు యాదవ్, వేణుయాదవ్, నాయకులు బుట్టి శివకుమార్, నవీన్‌యాదవ్, రవికాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరం



నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

నేరడిగొండ: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. మండలంలోని తేజాపూర్ గ్రామంలో మంగళవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయొద్దన్నారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న భానురేఖ

తాంసి: ఎయిడ్స్‌పై అవగాహన పెరిగితేనే నియంత్రించవచ్చునని ష్యూర్ ఎన్‌జీవో మేనేజర్ భానురేఖ పేర్కొన్నారు. మంగళవారం తాంసి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్, ఇతర వ్యాధులపై అవగాహన కల్పించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతోనే వ్యాధుల బారినపడకుండా ఉండవచ్చునని తెలిపారు. ఐసీటీసీ రిమ్స్ అధికారి అరుణ, ఎన్‌జీవో వర్కర్స్ లలిత, స్వప్న ఉన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం గ్రంథాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందిస్తామని లైబ్రేరియన్ శ్రీనివాస్ తెలిపారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి



పంట క్షేత్రాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): పత్తి పంటను గులాబీ పురుగు ఆశిస్తుందని, దీని నివారణకు రైతులు పొలాల్లో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కె.రాజశేఖర్, సునీల్ కుమార్, శివచరణ్ అన్నారు. మంగళవారం జైనథ్, బేల మండలాల్లోని వివిధ పంట క్షేత్రాలను సందర్శించారు. పత్తిని ఆశించే గులాబీ పురుగు నివారణకు ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి సమయంలో గుడ్లపై మంటలు, సోలార్ లైట్ ట్రాప్‌లు పెట్టాలన్నారు. కందిలో శనగపచ్చ పురుగు, ఆకుపచ్చ పురుగు, కాయ, ఈగ నివారణకు ఫ్లూబెండమైడ్ ఎకరానికి 50 మి.లీ, ఐసోసైక్లోజోరమ్ ఎకరాకు 100 మి.లీ, ఫుక్సామోటోఫైడ్ పిచికారి చేయాలని సూచించారు.

సింహగర్జన సభ విజయవంతం చేయండి

నేరడిగొండ/బోథ్: హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ కోరారు. నేరడిగొండలో మంగళవారం నిర్వహించిన మాల సంక్షేమ సంఘం కార్యనిర్వాహక సమావేశంలో మాట్లాడారు. మాల అనుబంధ కులాలు ఈ సభకు తరలిరావాలని కోరారు. అనంతరం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు మల్లన్న, కిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, మండల అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు. బోథ్‌లో రమేశ్ సంఘం నాయకులతో కలిసి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు రాజు.. రమేశ్‌ను సన్మానించారు. సుధీర్ సుభాష్, మల్లన్న, అశోక్, కిరణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కొలువుదీరిన ఆలయ పాలకవర్గం



కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఈవో వామన్‌రావు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయ నూతన పాలకవర్గం మంగళవారం కొలువుదీరింది. అధ్యక్షుడిగా అడ్డి రాకేశ్‌రెడ్డితోపాటు సభ్యులుగా రమేశ్, అశోక్, విలాస్, విజయ్‌కుమార్, లసుంబాయి, గంగమ్మ, మారుతితోపాటు ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా అర్చకుడు వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగు రవి కిషన్ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించి అభినందించారు. తహసీల్దార్ శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, అర్చకుడు వెంకటరమణచారి, ఈవో వామన్ పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

జైనథ్‌లో లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం చేపట్టే స్వామివారి రథోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పెద్ద రథంపై గ్రామ ప్రధాన వీధుల గుండా చేపట్టే శోభాయాత్రకు జిల్లా నుంచే కాక మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు. ఐదో రోజైన మంగళవారం స్వామివారి ఉత్సవ విగ్రహం గరుడ వాహనంపై చిన్న రథంపై ఊరేగించారు. బుధవారం ఆరో రోజున సాయంత్రం పెద్ద రథోత్సవ కార్యక్రమం చేపడుతారు. అదేవిధంగా ఏడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు.

స్పెషల్ కేటగిరీతో ఉద్యోగులకు నష్టం



వినతిపత్రం అందజేస్తున్న వైద్యశాఖ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: పదోన్నతుల్లో స్పెషల్ కేటగిరీ వారికి ప్రాధాన్యత ఇవ్వడంతో తమకు తీవ్ర నష్టం జరుగుతుందని వైద్య ఉద్యోగులు పేర్కొన్నారు. మంగళవారం టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్ కుమార్‌లను కలిసి ఆ శాఖ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బదిలీల్లో మాత్రమే స్పెషల్ కేటగిరీ వర్తిస్తుందని, కానీ వైద్య శాఖలో మాత్రం అలా జరగడం లేదన్నారు. తమకు పదోన్నతులు రాక మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నామని, గత కొన్నేళ్లగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని పేర్కొన్నారు. వైద్యశాఖ సూపరింటెండెంట్ గోపి, ఉద్యోగులు నాగరాణి, మజీద్, గంగారెడ్డి, కిరణ్, మహమూద్, చైతన్య, ఇంద్రవేణి, రాజు, సందీప్, అక్షయ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు జోగు రవి, రఘుపతి, సంతోశ్ తదితరులు ఉన్నారు.

ఒక జేసీబీ, రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బేల: మండలంలోని కాంఘర్‌పూర్ రెవెన్యూ శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక జేసీబీ, రెండు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యలకు జిల్లా మైనింగ్ శాఖకు నివేదించినట్లు తెలిపారు.

ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో ఝాన్సీలక్ష్మి బాయి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎంలు కృష్ణ చైతన్య, కోస్మెట్టి శుద్ధోధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్‌లోని మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో విధుల్లో చేరిన ఏడీ జాదవ్ భాస్కర్‌ను బజార్‌హత్నూర్ మండలం గిరిజన మత్స్య శాఖ సహకార సంఘం అధ్యక్షుడు నైతం రమేశ్, సభ్యులు మంగళవారం సన్మానించారు. ఉట్నూర్ మత్తడివాగు మత్స్యశాఖ అధ్యక్షుడు సిడం సోనేరావ్, కార్యదర్శి ఉయికే సుదర్శన్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార పోస్టర్లను ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ ఆవిష్కరించారు. విద్యార్థులతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను మాస్టర్‌ట్రైనర్స్ ఎం.నర్సింగ్‌రావు, రవీందర్ వివరించారు. వైస్‌ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, అధ్యాపకులు అనిత, రాణి, ముజీబ్, రాజశేఖర్, కరుణాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

బోథ్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఎంఈవో పోశెట్టి, ప్రిన్సిపాల్ సంగీత, వైస్ ప్రిన్సిపాల్ లత, మాధవి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో మంగళవారం పొచ్చమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌లో అవర్లీబేస్డ్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్ పోస్టు కోసం అభ్యర్థులు ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఎడ్ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆదిలాబాద్‌రూరల్: అంకోలి పీహెచ్‌సీ ఖానాపూర్ సబ్ సెంటర్ పరిధిలో గల బోరింగ్‌గూడ, మారెగాం, తిప్ప గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సర్వరాజ్, సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సుభాష్, ల్యాబ్ టెక్నీషియన్ సుష్మ, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



కైలాస్‌నగర్: ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: దేశ తొలి ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ఇందిరాగాంధీ కృషిచేశారని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు ఖయ్యూం, రాజేశ్వర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

● హస్నాపూర్‌లో కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు జావిద్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కాంబ్లే పృథ్వీరాజ్, అశోక్, మదన్‌రావు, యాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ స్ఫూర్తిగా సంక్షేమ పథకాలు

కైలాస్‌నగర్: ఇందిరమ్మ పాలన స్ఫూర్తిగా రేవంత్ రెడ్డి సర్కారు పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గరీబీ హటావో నినాదంతో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, నాయకులు గిమ్మ సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● మహిళా సాధికారత కోసం ఇందిరాగాంధీ చేసిన కృషి మరువలేనిదని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తన నివాసంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉక్కు మహిళగా పేరొందిన ఆమె పాలనలో బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ రహీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో ఇందిరాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజుయాదవ్, మాజీ ఎంపీటీసీ కుర్మె మహేందర్, మేరుగు భోజన్న, అబూద్, శేఖర్, గంగారాం, గడ్డల నారాయణ పాల్గొన్నారు.

బేల: మండలకేంద్రంలోని మార్కెట్ కూడలి వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, నాయకులు సుధాంరెడ్డి, వాంఖడే వామన్, విలాస్, అక్తార్, రూప్‌రావు, ఘణేశ్యాం, శంకర్, చంద్రకాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.



కైలాస్‌నగర్: నివాళులర్పిస్తున్న నాయకులు



దుప్పట్లు అందజేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే



బేల: నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న మనోహర్

బజార్‌హత్నూర్: మారుమూల గ్రామాలు అధికంగా ఉన్నందున ఆసుపత్రిలో ప్రసవాలు పెంచేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి గది, గర్భిణుల వెయిటింగ్ హాల్, జనరల్ వార్డు, ఫార్మ రూం, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మెడికల్ ఆఫీసర్ భీంరావ్, హెచ్ఈవో జయప్రకాశ్, రమేశ్, అశోక్, శంకర్, రవీందర్ ఉన్నారు.

28న సీఐటీయూ జిల్లా భవనం ప్రారంభం

తాంసి: జిల్లా కేంద్రంలో ఈనెల 28న నూతన సీఐటీయూ జిల్లా భవనాన్ని మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందకారత్ ప్రారంభిస్తారని జిల్లా ఉపాధ్యక్షురాలు వెంకటమ్మ తెలిపారు. భీంపూర్ మండల కేంద్రంలో మంగళవారం భవన పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద సభ ఉంటుందన్నారు. నాయకులు రాములు, స్వామి, అంగన్‌వాడీలు మీరాబాయి, సుజాత, పార్వతి ఉన్నారు.

రైల్వే అభివృద్ధికి కృషి చేయాలి

ఆదిలాబాద్: జిల్లాలో రైల్వే అభివృద్ధికి కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇటీవల రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్ గా నియామకమైన కౌన్సిలర్ ఉష్కం రఘుపతి మంగళవారం ఎంపీ, ఎమ్మెల్యేలను జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన వెంట నాయకులు కృష్ణ యాదవ్ తదితరులు ఉన్నారు.



ఎంపీని సన్మానిస్తున్న రఘుపతి

మసీదుల అభివృద్ధికి రూ.86 లక్షలు



ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.4 కోట్లు మంజూరు కాగా, అందులో రూ.86 లక్షలను మసీదుల అభివృద్ధికి కేటాయించినట్లు కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మైనార్టీ పెద్దలు, మైనార్టీ నాయకులకు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. 115 పనులకు ప్రొసిడింగ్‌లను అందజేశామన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ తదితరులు పాల్గొన్నారు.